క్లుప్తంగా

మహేశ్వరీదేవిగా రాజరాజేశ్వరిదేవి దర్శనం


మహేశ్వరీదేవిగా దర్శనమిస్తున్న రాజరాజేశ్వరిదేవి అమ్మవారు

బొండపల్లి: వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవుపల్లి లోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో నాలుగో రోజు మంగళవారం అమ్మవారు మహేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన చేశారు. పలువురు భక్తులు మంగళవాయిద్యాలతో ప్రభలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

జామి: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. దుకాణాల లైసెన్స్‌లు, ఎరువులు, పురుగు మందుల నిల్వలు, వాటి కాలపరిమితి, రికార్డులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ డీఎస్పీ ఎస్.తాతారావు, ఏలూరు వ్యవసాయ శాఖ ఏడీ బి.గంగాధరరావు, జామి ఏఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సోమలింగాపురం వీఆర్‌ఓ మృతి


వీఆర్‌ఓ పాపారావు (ఫైల్)

మెరకముడిదాం: సోమలింగాపురం వీఆర్‌ఓ పాపారావు (55) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలోనే మృతిచెందారు. నెల్లిమర్ల మండలంలోని తమ్మాపురం ఈయన స్వగ్రామం. భార్య పైడమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మండల రెవెన్యూ సిబ్బంది మృతుడు పాపారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాఠశాల సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

దత్తిరాజేరు: దత్తి గ్రామ ఉన్నత పాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ మంగళవారం ఉదయం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, తదితర రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా చూసుకోవాల్సిన బాధ్యత ఎంఈఓ, ఉపాధ్యాయులదేనని అన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పరిశీలన


గురుకుల పాఠశాలలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల బాలికల పాఠశాల, మోడల్ స్కూల్‌ను ఎంఈఓ బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను పరిశీలించి, నిర్వహణపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఎంఈఓ వెంట గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్, ఉపాధ్యాయుడు వెంకటరమణమూర్తి, నోడల్ టీచర్ బేబీరాణి, సీఆర్పీలు ఉన్నారు.

భాస్కరరావు సేవలు ఎనలేనివి

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి సిరిమాను అధిరోహకులుగా, అమ్మవారి దేవస్థానంలో అర్చకులుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి, అందరికీ స్ఫూర్తిప్రదాతగా నిలిచిన దివంగత తాళ్లపూడి భాస్కరరావు సేవలు ఎనలేనివని అమ్మవారి ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కొనియాడారు. భాస్కరరావు 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు దేవస్థానం ఉద్యోగి తాళ్లపూడి ధనుంజయ్ భక్తులకు మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ.. సిరిమానును అధిరోహించిన తాళ్లపూడి నిరంతరం అమ్మసేవలోనే తరించేవారన్నారు. ఆలయ సిబ్బంది ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని భక్తులకు సేవలందించాలని కోరారు. బంటుపల్లి వెంకటరావు, రమేష్ పట్నాయక్, ఎం.బి. సత్యనారాయణ, శివప్రసాద్, ఉమ, సూర్యపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొత్స పుట్టినరోజు వేడుకలు


చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు


శృంగవరపుకోట: మాజీ మంత్రి బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, చినరామునాయుడు


గుర్ల: గుర్ల మండలంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


మెరకముడిదాం: చినబంటుపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


గజపతినగరం: బొత్సకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జెడ్పీటీసీ గార తవుడు

చీపురుపల్లిరూరల్(గరివిడి):వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలను గరివిడి, గుర్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గరివిడి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో, గుర్ల మండల కేంద్రంలో కేకులు కట్ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హయాంలో చీపురుపల్లి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. చీపురుపల్లి నియోజకవర్గానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారన్నారు. గరివిడిలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, నాయకులు లెంక శ్రీరాములు, ఎడ్ల అప్పారావు, బమ్మిడి అప్పలస్వామి, వలిరెడ్డి లక్ష్మణ, పొన్నాడ కుమార్, బమ్మిడి కార్తీక్, గుర్లలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చినబంటుపల్లిలో..

మెరకముడిదాం: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలను మండలంలోని చినబంటుపల్లి గ్రామంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు కేక్ కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మెరకముడిదాం మండలంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది బొత్స సత్యనారాయణ వల్లేనని అన్నారు. నాయకులు కె.ఎస్.ఆర్. కె.ప్రసాద్, వైస్ ఎంపీపీలు టి.హరిబాబు, కందుల మల్లికార్జునరావు, కర్రోతు నాగేశ్వరరావు, పప్పల కృష్ణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

శృంగవరపుకోట/గజపతినగరం: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, గజపతిన గరం జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంలో బొత్సను ఆయన నివాసంలో మంగళ వారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


గుర్ల కేజీబీవీలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేయిస్తున్న జడ్జి విజయకల్యాణి

చీపురుపల్లిరూరల్(గరివిడి): విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) సిబ్బందికి విజయనగరం సివిల్ జడ్జి కె.విజయకల్యాణి సూచించారు. గుర్ల మండలంలోని కేజీబీవీని మంగళవారం ఆమె సందర్శించారు.తరగతి, వసతిగదులను, పిల్లల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం రోజు టిఫిన్, భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ, శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జడ్జి వెంట ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ భానుప్రకాష్, కేజీబీవీ ఎస్‌ఓ ఝాన్సీ ఉన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే


ఇంటింట సర్వే చేస్తున్న జిల్లా మలేరియా అధికారి మణి

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సచివాలయ, వైద్య సిబ్బంది మంగళవారం ఇంటింట సర్వే నిర్వహిం చారు. బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం రెండోరోజు కొనసాగింది. వైద్యాధికారి రమాదేవి, సిబ్బంది శిబిరంలో 56 మందికి వైద్యపరీక్షలు చేశారు.11 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. మలేరియా, డెంగ్యూ టెస్టులు చేశారు. జిల్లా మలేరియా అధికారి మణి గ్రామాన్ని సందర్శించారు. వైద్యశిబిరంలో సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. ఇంటింట సర్వేను పరిశీలించి, ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. సర్పంచ్ దివదారి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కిశోర్ గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి బి.శ్రీనివాసరావు, హెచ్ఎస్ మూర్తి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ


రైతులకు పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్న జేడీ రమణ, తదితరులు

శృంగవరపుకోట: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ధర్మవరం పశువైద్యకేంద్రంలో పాడి రైతులకు రాయితీపై పశుగ్రాస విత్తనాల ను పశుసంవర్ధకశాఖ జేడీ వై.వి.రమణ మంగళవారం పంపిణీ చేశా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమకున్న కొద్దిపాటి స్థలంలో మేలురకం పశుగ్రాసాన్ని పెంచి, దాన్ని పాడిపశువులకు మేతగా వేస్తే ఆరోగ్యంగా ఉంటాయని, అధిక పాలదిగుబడి వస్తుం దని తెలిపారు. పశువులు లంపి స్కిన్ వ్యాధి బారినపడకుండా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా 2,20,000టీకాలు వేసే కార్యక్రమాన్ని మూడు రోజులు గా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గొర్రెల్లో నీలి నాలుక రాకుండా టీకాలు వేస్తున్నామని, రైతు సేవా కేంద్రాల ద్వారా కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు సూచించారు. ఏడీ చలపతిరావు, ధర్మవరం పశువైద్యకేంద్రం అధికారి జి.హేమ, సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

చొరబాటుదారులను నిలువరించేందుకే 'సాగర కవచ్'


సమావేశంలో మాట్లాడుతన్న మెరైన్ సీఐ వైకుంఠరావు

● మెరైన్ సీఐ వైకుంఠరావు

భోగాపురం: సముద్ర మార్గం గుండా వచ్చే ఉగ్రవాదులు, చొరబాటుదారులను నిలువరించేందకు సాగర కవచ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని మెరైన్ సీఐ వైకుంఠరావు అన్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సాగరకవచం మాక్‌డ్రిల్‌పై మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో 970 కిలోమీటర్ల మేర సముద్రతీరం విస్తరించి ఉందన్నారు. గతంలో గుర్తుతెలియని వ్యక్తులు, ఉగ్రవాదులు సముద్రమార్గం గుండా మన దేశంలోకి ప్రవేశించడం వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. చొరబాటుదారులను నివారించేదుకు ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు రెండు మండలాల్లోని 16 మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్సైలతో పాటు 197 మంది సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు


కొత్తపాలెం రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: గ్రామ సభలు నిర్వహించి అర్హత ఉన్న కౌలు రైతులను గుర్తించి క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డు (సీసీఆర్సీ) అందజేస్తున్నామని ఏఓ పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని కొత్తవలస, వెదురువాడ,కొత్తపాలెం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. గుర్తింపు కార్డులు కావాల్సిన కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అర్హులకు కార్డులు మంజూరు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూయజమానులకు ఎటువంటి నష్టం లేకుండా ప్రభుత్వం అందించే వ్యవసాయ సంబంధ రాయితీలు,పెట్టుబడిసాయం కౌలు రైతులు పొందేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వీఏఏలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

12 నాటుబళ్లు పట్టివేత


పట్టుకున్న నాటుబళ్లతో రెవెన్యూ సిబ్బంది

నెల్లిమర్ల: స్థానిక చంపావతి నదిలో రెవెన్యూ అధికార్లు 12 ఇసుక నాటుబళ్లు పట్టుకున్నారు. చంపావతి నదిలో నీటి పథకాల వద్ద ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్న నాటుబళ్లను తహసీల్దార్ డి.ధర్మరాజు, రెవెన్యూ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ క్రమంలో అక్రమార్కులు తహసీల్దార్‌తో వగ్వాదానికి దిగారు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు రావడంతో నాటుబళ్ల యజమానులు బళ్లను అక్కడే వదిలేసి ఎద్దులను తీసుకుని వెళ్లిపోయారు. అనంతరం తహసీల్దార్ ధర్మరాజు మాట్లాడుతూ.. తాగునీటి పథకాలు, వంతెనలకు 500 మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని, అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టినా, తరలించినా కేసులు నమోదు చేసి భారీగా జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గ సమావేశం


మాట్లాడుతున్న రాష్ట్ర శిక్షణాధికారి ఎం.మోహనరావు, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక పూల్‌బాగ్‌లో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల అభివృద్ధికి, ఆయా యూనిట్లలో ఉన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జోన్–1 ఇన్‌చార్జ్ రాష్ట్ర శిక్షణాధికారి ఎం.మోహనరావు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వాక చిన్నంనాయుడు సమన్వయంతో నిర్వహించిన ఈ సమావేశంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ ఈపు విజయకుమార్, కె.సౌభాగ్యలక్ష్మి, బీపీఏ రాజు, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.నారాయణమూర్తి, వి.త్రినాథరావు, సహాయ కార్యదర్శి ఎస్.కనకమహాలక్ష్మి, డీఓసీలు డి.ప్రవీణ్‌కుమార్, కె.గాయత్రి, డీటీసీలు వి.సూర్యనారాయణ, హెడ్‌క్వార్టర్ కమిషనర్లు ఎస్ఎస్.దొర, ఎన్.పుష్పలత, ఏడీసీలు శ్రీనివాసశర్మ, రామలక్ష్మి, స్వరూప్, విజయలక్ష్మి, స్టేట్ మీడియా కరస్పాండెంట్ టీవీ రామ్‌కాశ్యప్, ఏఎస్‌ఓసీ దుర్గానాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లను సద్వినియోగించుకోండి



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇతర నాయకులు స్టూడెంట్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టూడెంట్ కిట్లలో బ్యాగు, షూస్, బెల్టు, సాక్సులు, నోట్, పాఠ్య పుస్తకాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చదువు భారమవ్వకుండా ఉండేందుకు గత ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యాకానుక పేరుతో ఈ కిట్లను అమల్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అవే కిట్లను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, మీసాల శీతారాం, బలగ రమేష్, కరణం ఆది, ఇప్పిలి కృష్ణ, కోరుకొండ దాలయ్య, మహంతి లక్ష్మణ, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


దత్తిరాజేరు: కె.కొత్తవలసలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్రవంతి


వేపాడ: వేపాడలో గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న డాక్టర్ ధరణి, ఫణిశ్రీ

దత్తిరాజేరు: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో 40 మంది గర్భిణులకు మంగళవారం వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడలో...

వేపాడ: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ధరణి, గైనాకాలజిస్ట్ ఆర్.ఫణిశ్రీ గర్భిణులకు మంగళవారం వైద్య తనిఖీలు చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి జాగ్రత్తలు సూచించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు బానాది సత్య సాయి సేవా సమితి భోజనాలు సమకూర్చింది.

కమాండో గోవింద్‌కు నివాళి


కమాండో గోవింద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన సీఆర్‌పీఎఫ్ కమాండో గోవింద్ వర్ధంతిని గరివిడి పోలీస్‌స్టేషన్‌లో సీఆర్‌పీఎఫ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 2007వ సంవత్సరంలో చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో నక్సల్స్ జరిపిన దాడు ల్లో కమాండో కె.గోవిందరావు అమరుడయ్యారు. ఆ సంఘటనలో అమరులైన వారందరినీ స్మరించుకోవాలని సీఆర్‌పీఎఫ్ డీజీ ఆదేశాల మేరకు సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ గంగిరెడ్డి, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గరివిడి ఎస్ఐ ఎల్.దామోదరరావు కమాండో గోవింద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోవిందరావు భార్య సుజాతను సన్మానించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఏఎస్ఐలు రమణ, హరి, పోలీస్‌సిబ్బంది పైడితల్లి, ఆనంద్, సామాజిక సేవా సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్య సిబ్బంది

గంట్యాడ: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల చాలా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రామవరం గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు వైద్యసిబ్బందితో కలిసి జాగ్రత్తలు సూచించారు. దోమల వల్లే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తాయని, దోమల నివారణ కోసం ఇళ్ల ముందు, పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పూల కుండీలు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు లేకుండా చూసుకోవాలని వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్నే భుజించాలని, వంటకాలపై మూతలు పెట్టాలని సూచించారు. గ్రామ సర్పంచ్ హైమావతితో పాటు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షు డు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ ఎర్రన్న, పంచాయతీ కార్యదర్శి ఎల్.తవుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం

నెల్లిమర్ల రూరల్: జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతఃకాలార్చన, అనంతరం ఆలయ ప్రధాన ముఖద్వారం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం నూతన వస్త్రాలతో స్వామిని సుందరంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేశారు. స్వామి సన్నిధిలో హనుమాన్ ఛాలీసా పఠించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్, పవన్, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.